క్లుప్తంగా

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో కలిసి శంకుస్థాపన చేసి రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తోట వెంకట్రావ్ వీధిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గణేష్, నర్సింహారావు, కమల్ పాషా, కృష్ణయ్య, చెన్నారావు, సామేలు, అప్పారావు, కరుణాకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కారేపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోమట్లగూడెం ఆరోగ్య ఉపకేంద్రం వైద్యురాలు ప్రబంధ సూచించారు. సోమవారం కొమ్ముగూడెం గ్రామంలో వైఆర్‌జీ కేర్ లింగ్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్‌క్యాంపులో రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ స్కీం డీఆర్‌పీ శివయ్య, క్లస్టర్ లింక్‌వర్కర్ ఆదెర్ల శంకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం, ఏఎన్‌ఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో లబ్ధిదారుడికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కు అందించి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన బింగి నాగమణికి వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.27,500 చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు రమేష్, నాగేశ్వరరావు, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సబ్ స్టేషన్ పరిధిలో ముద్దునూరు ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దారా కృష్ణ కాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు విద్యార్థి ఎంపిక



తాటి షర్మిల

కొణిజర్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జాతీయ స్థాయిలో.. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తాటి షర్మిల ఉత్తమ ప్రతిభ కనబర్చిన స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షలో అర్హత సాధించి విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేయనున్నారు. ఈ సందర్భంగా షర్మిలను పాఠశాల హెచ్‌ఎం పమ్మి శివనారాయణ, సిబ్బంది అభినందించారు.

'లోక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రుపాలెం: మధిర కోర్టులో ఈనెల 14న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఆర్.రమేష్ కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజీపడ దగిన కేసులను లోక్ అదాలత్ రాజీ చేసుకోవచ్చన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

బోనకల్: ఈ నెల 11న ముష్టికుంట్లలో నిర్వహించే సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. సోమవారం మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆకెన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర బాస్కర్‌రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించరూ..?

- నెరవేరని పాలకుల హామీలు
- రైతులకు తప్పని తిప్పలు
- కోటిలింగాల జాతర సమయంలో.. బుగ్గవాగు దాటలేక భక్తుల ఇక్కట్లు



బుగ్గవాగు పై నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ (ఫైల్)



కోటిలింగాల వద్ద బుగ్గవాగు దాటుతున్న రైతులు, భక్తులు (ఫైల్)

కారేపల్లి: కారేపల్లి – ఇల్లెందు మండలాల సరిహద్దులో బుగ్గవాగుపై కోటిలింగాల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పట్లో మోక్షం కలిగేటట్లు లేదు. దశాబ్దాలు దాటుతున్నా.. బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైతన్నలు, భక్తులు వాగు దాటేందుకు పాలకులు చర్యలు చేపట్టడం లేదు.

– బుగ్గవాగు ఇల్లెందు మండల ఏజెన్సీ అటవీప్రాంతం, గుట్టల నుంచి ప్రారంభమై ఇల్లెందు పట్టణం మీదుగా.. కారేపల్లి మండలంలోని పురాతన శైవక్షేత్రమైన కోటిలింగాల దేవాలయం వద్ద ప్రవేశిస్తుంది. కారేపల్లి మండలంలో కోటిలింగాల, జమాలపల్లి, కట్టుగూడెం, పేరుపల్లి, కారేపల్లి, గేటుకారేపల్లి మీదుగా కామేపల్లి మండలం, రఘునాథపల్లి మండలం, ఖమ్మం రూరల్ మండలంలో బుగ్గవాగు ప్రవహిస్తూ.. ఖమ్మం రూరల్ మండలంలోని శైవ క్షేత్రం తీర్థాల (కుడెల్లి) వద్ద మున్నేరు వాగులో కలుస్తుంది.

తిప్పలు తప్పడం లేదు..

పోలంపల్లి జీపీ పరిధిలోని కోటిలింగాల వద్ద బుగ్గవాగుకు అవతల వైపు రైతుల పొలాలు ఉన్నాయి. సీజన్‌లో తమ పొలాలకు ట్రాక్టర్లు, పశువులను, అరకలను తోలుకొని అవతల ఒడ్డుకు వెళ్లి పనులు చేయాలి. అదే వర్షాకాలంలో మందు కట్టలు తీసుకెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. వాగు ఉధృతంగా ప్రవహిస్తే.. 3కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇల్లెందుకు వెళ్లి, మరళ 3కిలో మీటర్లు ప్రయాణించి తమ పొలాలకు చేరుకోవాల్సి పరిస్థితి నెలకొంది. అదే బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే.. మాకు కష్టాలు తప్పుతాయని, పాలకులు హామీలు ఇస్తున్నారే కానీ పనులు చేపట్టడం లేదని రైతన్నలు తమ గోడు చెప్పుకుంటున్నారు.

పాట్లు పడుతున్న భక్తులు..

మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రం కోటిలింగాల జాతర ప్రాంగణంలో జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆ జాతరకు భక్తులు వచ్చి బుగ్గవాగులో స్నానమాచరించి శివలింగాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ జాతరకు కారేపల్లి మండలంతో పాటు, సరిహద్దు మండల నుంచి కూడా భక్తులు రావడంతో బుగ్గవాగు కిక్కిరిసి పోతుంది. 5ఏళ్ల క్రితం జాతర సమయంలో భక్తులు బుగ్గవాగు దాటేందుకు.. అధికారులు తాత్కాలికంగా తాళ్లు, చెక్కలతో ఏర్పాటు చేసిన చెప్పాట తెగిపోవడంతో సుమారు 20మంది భక్తులు వాగులో పడిపోవటం, అక్కడ ఉన్న వాలంటీర్లు, ఈతవచ్చిన భక్తులు వారిని రక్షించటంతో పెద్ద ముప్పుతప్పినట్లయ్యింది. దీంతో బ్రిడ్జి ఏర్పాటుకై ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో ప్రస్తావన..

కాగా, ఇటీవల భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోటిలింగాల వద్ద బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రస్తావించారు. పోలంపల్లి, మోకాళ్ల గుంపు నుంచి కోటిలింగాల వరకు బీటీ రోడ్డు, జాతర సమయంలో భక్తులు పడే ఇక్కట్లను వివరించారు. ఈ సందర్భంగా.. సింగరేణి సంస్థ ద్వారా బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇల్లెందు ఏరియా జీఎం కోరారు. దీనికి సానుకూలంగా స్పందన వచ్చిందని.. వైరా ఎమ్మెల్యే స్థానిక విలేకరుల దృష్టికి సైతం తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, సింగరేణి సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రవికుమార్, అంజిరెడ్డి లు కోటిలింగాల వద్ద బుగ్గవాగును పరిశీలించి, సింగరేణి యాజమాన్యానికి ప్రతిపాదనలను పంపుతామని పేర్కొన్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా పంట పొలాలన్నీ బుగ్గవాగుకు అవతల ఉండడంతో అక్కడికి పోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వాన కాలంలో వాగు పొంగడంతో 6కిలోమీటర్లు ప్రయాణించి ఇల్లెందు చేరుకొని అక్కడి నుంచి వెనక్కి మా పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం చేపట్టితే బాగుంటుంది. లేదంటే మా రైతన్నల కష్టాలు ఎన్నటికీ తీరవు.

– అలెం వెంకటేశ్వర్లు, రైతు, పోలంపల్లి

హామీలతోనే సరి..



సింగరేణి సంస్థ ప్రతినిధులు కోటిలింగాల బుగ్గవాగును పరిశీలించారు. బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని హామీలు సైతం ఇచ్చారు కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదు. రైతులు తమ వ్యవసాయ పనిముట్లను, పంట ఉత్పత్తులను వాగు దాటించాలంటే.. నానా ఇబ్బందులు పడుతున్నారు. బుగ్గవాగు ఉధృతికి రైతులు పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురైన ఘటనలు లేకపోలేదు.

– ధరావత్ భద్రునాయక్, రైతు, పోలంపల్లి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: నూతనంగా గ్రామశాఖ అధ్యక్షులుగా ఎన్నికైన వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని గొల్లపూడి, గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ, రెబ్బవరం, తాటిపూడి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సమావేశం నిర్వహించి గ్రామశాఖ అధ్యక్షులను నియమించారు. అనంతరం జైబాపు జైభీమ్ జై సం విధాన్‌లో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, దొడ్డా పుల్లయ్య, బీడీకే రత్నం, పమ్మి అశోక్, మచ్చా బుజ్జి పాలేటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

బోనకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని ఎంఈఓ దామాల పుల్లయ్య అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాత సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌కి ధీటుగా ఉన్నత విద్య అందుతుందని, ఇప్పటికే ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గుగులోతు రామకృష్ణ, సద్దాబాబు, రంగారావు, గోపాల్‌రావు, గంగాభవాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో తీవ్ర గాయాలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ సమీపాన సోమవారం ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కొణిజర్ల మండలం సిద్ధిక్‌నగర్‌కు చెందిన మోట వీరబాబుకు తీవ్రగాయాలు కాగా, 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భార్యపై భర్త దాడి

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో గుండెబోయిన రమేష్ తన భార్య నందినిపై సోమవారం దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమేష్ మద్యానికి బానిస కావటమే కాకుండా మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని గత కొంతకాలంగా భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులను ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన భార్యతో గొడవ పడి అసభ్య పదజాలంతో దూషిస్తూ కర్రతో తల, చేతులు, కాళ్లపై కొట్టడంతో తలకు గాయమైంది. భార్య నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్ మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం



దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైరా: వైరా శాంతినగర్ శాస్త్రానగర్‌లో గల హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయ 30వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక అలంకరణ చేశారు. వైరాతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వామి దీక్షా పరులు, భక్తులు వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి రంగా జనార్దన్, పాలిశెట్టి వెంకటేశ్వరరావు, పెనుగొండ రామారావు, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా షిర్డీసాయి మందిరం..



సాయినాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీషిర్డీసాయి బాబా సేవా మందిరం 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడికి కాగడహారతీ, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజలు, సాయి సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. పల్లకీ ఉత్సవం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొణిజర్ల శ్రీనివాసరావు, దోసపాటి రాజా, కిలారి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల గాంధీ, మొరిశెట్టి సాంబశివరావు, దొడ్డా శంకర్‌రావు, హైమావతి, గుండు ఉమా, బెజవాడ శ్రీనివాసరావు, అడపా సాయి, బచ్చు శ్రీనివాసరావు, చక్రదర్‌రావు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్

కారేపల్లి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారులు కట్టుకోవాలని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. మండలంలోని అప్పాయిగూడెం రైతు వేదికలో లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులు 400ల చదరపు అడుగులకు తక్కువ కాకుండా, 600ల చదరపు అడుగులకు ఎక్కువ కాకుండా ఇల్లు నిర్మాణం చేపట్టాలని, సిమెంట్, ఇటుకలు, ఐరన్ రాడ్ మొదలైన ఇంటి నిర్మాణ మెటీరియల్ ఎంత మోతాదులో తెచ్చుకోవాలి అనేది సైట్ ఇంజనీరింగ్ సిబ్బంది తెలియపరుస్తారన్నారు. ముగ్గు పోసే ముందు కార్యదర్శులు ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని లేకపోతే డబ్బులు అకౌంట్‌లో పడవన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క నిరుపేదలకీ మహిళా సమాఖ్య ద్వారా బ్యాంక్ లోను ఇప్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీంద్రప్రసాద్, హౌసింగ్ ఏఈ నాగేందర్, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..



పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అన్నారుగూడెంలో 40మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేయడంతో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోవింద్ శ్రీనువాసరావు, మార్లెళ్ల మల్లిఖార్జున్‌రావు, తుమ్మలపల్లి రమేష్, తాళ్ల జోసఫ్, పొన్నం కృష్ణయ్య, దుగ్గినేని వెంకటయ్య, సురేష్, రాఘవ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



ఏన్కూరు: గార్లఒడ్డులో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



సత్తుపల్లిరూరల్: బుగ్గపాడులో బడిబాటలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసాబేగం

వైరారూరల్/ఏన్కూరు/తల్లాడ/సత్తుపల్లిరూరల్: ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సర్కారు బడులను బలోపేతం చేయాలని ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లుచ నెమ్మకంటి దామోదరప్రసాద్ తెలిపారు. వైరాలోని విప్పలమడకలో, ఏన్కూరులోని గార్లఒడ్డులో, తల్లాడలోని పినపాక గ్రామాల్లో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగారు. అదే విధంగా సత్తుపల్లిలోని బుగ్గపాడు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసా బేగం తనిఖీ చేసి, అనంతరం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గరికపాడు హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ఏన్కూరు హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, గార్లఒడ్డు ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు వి.వెంకటస్వామి, ఆర్.లతా మాధూరి, బి.వెంకటబ్రహ్మం, జె.యాకుబ్, సీహెచ్.ఐజాక్, రవి, రాఘవరావు, శంకర్‌రావు, చంద్రప్రకాష్, వర్జీనియా, కస్తూరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం అందజేత



యూనిఫాం అందిస్తున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: మండలంలోని విద్యావనరుల కేంద్రంలో విద్యార్థుల యూనిఫాం లను ఆయా గ్రామాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ దుగ్గిరాల జయరాజు అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, కస్తూర్బా ఎస్‌ఓ ఝాన్సీసౌజన్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, స్టాంగ్ టీచర్‌లు లక్ష్మణ్, రామకోటి, శ్యామ్‌లాల్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మోతిలాల్, సీఆర్‌పీలు, సీసీలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టాలి

సత్తుపల్లి: నకిలీ విత్తనాలను, పురుగు మందులను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కే ఉమర్ డిమాండ్ చేశారు. సత్తుపల్లి డివిజన్ కేంద్రంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ కల్తీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక ప్రాంతాల్లో కల్తీ పురుగు మందులు, ఎరువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కల్తీ వ్యాపారులపై దృష్టి పెట్టి కల్తీలను అరికట్టాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సత్యనారాయణకు అందించారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, మారుతి రాఘవులు, పామర్తి లక్ష్మయ్య, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

మధిర: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నిరంతరం కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ తెలిపారు. మధిరలో యూనియన్ సభ్యత్వ నమోదును సోమవారం పరిశీలించిన ఆయన పలువురికి సభ్యత్వాలు అందజేశారు. అంతకుముందే ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకున్న యూనియన్ నాయకుడు పాగి బాలస్వామిని పరామర్శించారు. అనంతరం రామనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ చాలావరకు పరిష్కరించగలిగామని తెలిపారు. కాగా, జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యతపై ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు నాగెళ్ల శివానంద్, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

బోనకల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని చిరునోములలోని ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మధిర నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలపై పోరాటమే మార్గమన్నారు. భౌతికవాదం యదార్థం.. బావవాదం యదార్థం కాదు అనే అంశంపై వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు బోధించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోపాల్‌రావు, సురేష్, సైదులు, రామనప్పయ్య, ఖానా, రాము తదితరులు పాల్గొన్నారు.


'విజయ'లో ఫేర్‌వెల్ డే

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, స్టూడెంట్ ట్రైట్ ఫౌండర్ సీఈఓ లక్కరాజు చరణ్, లీడ్స్‌ఫర్ ఇండియా ఆర్గనైజేషన్ సీఈఓ మెహనీష్ ఎర్రా, మై క్యాప్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ కవిత పారుపల్లి ముఖ్య అతిథులుగా హాజరై క్యాంపస్ ప్లేస్‌మెంట్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్కరాజు చరణ్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు చెప్పిన ముగ్గురు విద్యార్థులకు స్పాట్ ఇంటర్న్‌షిప్ ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమమంలో వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ వి చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆయేషా తరుణమ్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏఓ ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నివాళి

తల్లాడ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి బానోత్ సోనాలి చిత్రపటానికి తల్లాడ మండల పరిషత్ సిబ్బంది సోమవారం నివాళులర్పించారు. రామచంద్రరావు బంజర్ పంచాయతీ కార్యదర్శి మరణం పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, తల్లాడ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణారావు, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న మాదినేని రమేష్

కల్లూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు ప్రభుత్వం రైతు భరోసా అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటసాగు ముగించిన తర్వాత చెల్లించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు, ఐద్వా నాయకురాలు పాల్గొన్నారు.